క్లుప్తంగా

పుస్తక పఠనంతో చక్కటి జ్ఞానం



పెదవేగి గ్రంథాలయంలో చదవడం మాకిష్టంలో పాల్గొన్న చిన్నారులు

పెదవేగి : విద్యార్థుల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చదవడం మాకిష్టం కార్యక్రమం ఎంతో ఉపయోగకరమైందని పెదవేగి గ్రంథ పాలకుడు తోట అరుణ్‌కుమార్ చెప్పారు. ఆదివారం పెదవేగి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ చిన్ననాటి నుంచే పుస్తక పఠనంతో చక్కటి జ్ఞానం ఏర్పడుతుందని చెప్పారు. ఇలా సంపాదించుకున్న జ్ఞానంతో ఎదిగే కొద్ది ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ఆస్కారం ఉంటుందని ఆయన తెలిపారు.

నేడు వెంకటకృష్ణాపురంలో మెగా వైద్యశిబిరం



మానవత సమావేశంలో మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు సూర్యనారాయణరాజు

ఉంగుటూరు: మానవత సంస్థ ఆధ్వర్యంలో కైకరం శివారు వెంకటకృష్ణాపురంలో సోమవారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి వెల్లడించారు. ఆదివారం నెలవారీ కైకరంలో మండల మానవత సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గోపి మాట్లాడుతూ ఆశ్రం ఆసుపత్రికి చెందిన 20 మంది వైద్య నిపుణులు పాల్గొని వైద్య సేవలు అందజేస్తారని తెలిపారు. సమావేశానికి మానవత అధ్యక్షుడు సూర్యనారాయణరాజు అధ్యక్షత వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పుసులూరి ప్రకాష్, మండల కార్యదర్శి గంజి రవి, శీతాల సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, కొనే సత్యనారాయణ, అడపా శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వాసుబాబును కలిసిన నాయకులు



ఎమ్మెల్యే వాసుబాబును సత్కరించిన గోపి, దొంతంశెట్టి

ఉంగుటూరు: వైఎస్సార్ సీపీ జిల్లా వీవర్సు అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు పుప్పాలగోపి ఆదివారం ఎమ్మెల్యే వాసుబాబును భవనపల్లిలోని క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉంగుటూరు చల్లాలమ్మ ఆలయ చైర్మన్‌గా కార్యకర్తలు ఎన్నుకున్న శ్రీరెడ్డి శ్రీనివాసరావు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు, ఎంపీటీసీ సభ్యులు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు తదితరులు ఉన్నారు.

చిరు వ్యాపారుల చెంతకు సాంకేతికత



కూరగాయల విక్రయానికి ఛార్జింగ్ మైక్ వినియోగిస్తున్న వ్యాపారి

గణపవరం: చిరు వ్యాపారులకు, తోపుడు బళ్ల వ్యాపారులకు, మొబైల్ వ్యాపారులకు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. గతంలో వీధుల్లో గొంతెత్తి అరుస్తూ వివిధ వస్తువులు, కూరగాయల వ్యాపారులు విక్రయించేవారు. వంకాయలు, బీరకాయలు, బెండకాయలు, అల్లం, ఉల్లి, మిర్చి..... అంటూ ఆయా కూరగాయల పేర్లు చెబుతూ వీధుల్లో పెద్దగా అరవాల్సి వచ్చేది. ఇప్పుడు అంత ఓపిక, అరిచే శక్తి సన్నగిల్లడంతో వ్యాపారులు ఆయా వస్తువుల పేర్లు, ధరలు రికార్డు చేసి చార్జింగ్ మైక్ సెట్ ద్వారా ఊర్లలో తిరుగుతూ వస్తువులు, కూరగాయలు విక్రయిస్తున్నారు. కూరగాయలతోపాటు ఫ్యాన్సీ సరకులు, కిరాణా సరకులు, రక రకాల పండ్లు, గృహోపకరణాలు, వంట పాత్రలు, తిను బండారాలు, పచ్చళ్లు వంటివి సైకిళ్లు, మోటార్ సైకిళ్లు, ఆటోలలో వేసుకుని గ్రామాల్లో తిరుగుతూ మైక్‌ల ద్వారా అందరికీ వినిపిస్తూ విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వీరు రోజంతా అరిచే అవసరం లేకుండా వారికి కొత్త ఛార్జింగ్ మైకులు అందుబాటులోకి వచ్చాయి. ఇటీవల ఇదే విధంగా సంక్రాంతికి హరిదాసులు కూడా తమ కీర్తనలను రికార్డుచేసి మోటార్ సైకిళ్లపై హ్యాండ్ మైక్‌లో వినిపిస్తూ గ్రామాల్లో తిరిగారు. చిరు వ్యాపారులకు ఈ ఛార్జింగ్ హ్యాండ్ మైక్‌లు చాలా ఉపయోగకరంగా ఉన్నాయి.

జగనన్న కాలనీల్లో అద్భుత నిర్మాణాలు



పెదపాడు సాయిబాబా గుడి లే అవుట్‌లో సెంటున్నర స్థలంలో నిర్మించిన ఇల్లు



కొత్తూరులోని జగనన్న గృహ నిర్మాణ లే అవుట్

- సెంటున్నర స్థలంలో సౌకర్యవంతంగా గృహ నిర్మాణం
- లబ్ధిదారుల్లో సొంతింటి కల నెరవేరిందన్న సంతోషం

దెందులూరు నియోజకవర్గంలో గృహ లబ్ధిదారుల వివరాలు

మండలం	లే అవుట్లు	లబ్ధిదారులు	ప్రారంభించినవి	బీబీఎల్	పునాది దశ	శ్లాబ్ దశ	పూర్తయిన ఇళ్లు
పెదపాడు	48	4,075	3,862	2,405	467	169	821
పెదవేగి	66	6,000	5,874	2,987	618	518	1,551
దెందులూరు	41	3,525	3,321	1,376	416	227	1,302
ఏలూరురూరల్	22	3,269	3,026	2,170	233	115	508

పెదపాడు: పేదలకు ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న సొంతింటి కల నెరవేరింది. ఇప్పటి వరకూ అద్దె ఇంటిలోనే కాలం వెళ్లదీసిన వారికి జగనన్న సొంతిల్లు సమకూర్చి ఆదుకున్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ స్థలాలు కేటాయించి ఇంటి నిర్మాణానికి రుణాలు మంజూరు చేసి వారిలో ఉత్సాహాన్ని రెట్టింపు చేశారు.

ప్రైవేటు భూములు కొనుగోలు

కొన్ని చోట్ల ప్రభుత్వ లేకపోవడంతో అధిక నిధులు వెచ్చించి ప్రైవేటు భూములను కొని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించారు. కాయ కష్టం చేసుకునే జీవించే మమ్మల్ని జగనన్న ఆదుకున్నాడంటున్న లబ్ధిదారుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో సబ్సిడీపై అందించిన ఇనుము, ఇసుక, సిమెంట్ తీసుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వం ఇచ్చిన ఆర్థిక సాయానికి మరింత సొమ్ము జోడించి ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తున్నారు. ఆయా నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి. కొంతమంది తమ ఇంటి నిర్మాణం పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేందుకు మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు ప్రత్యేకంగా శనివారం హౌసింగ్ డే ప్రకటించి, లబ్ధిదారులతో జగనన్న కాలనీల్లోనే మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. లబ్ధిదారులను ప్రోత్సహించేందుకు డ్వాక్రా సంఘాల నుంచి ప్రత్యేకంగా రూ.35వేలు రుణంగా అందిస్తున్నారు. దీంతో పాటు మరో రూ.50వేలు స్త్రీ నిధి నుంచి అప్పు ఇస్తున్నారు. ఎలాగైనా తమ ఇంటిని నిర్మించుకుని సొంతింటి కల నెరవేర్చేందుకు లబ్ధిదారులను అధికారులు తమ వంతు సేవలు అందిస్తున్నారు. నియోజకవర్గంలో 177 లేఅవుట్లలో 9,424 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించారు. 7,445 మంది సొంత స్థలంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మొత్తం 16,083 మంది లబ్ధిదారులకు ప్రభుత్వ రుణాలు అందుతున్నాయి. దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష చేసి ఇళ్ల స్థలాలు అందించడంలో తన వంతు కృషి చేసారు. కాలనీల్లో నీరు, కరెంటు, సదుపాయం, బోర్‌వెల్స్ ఏర్పాటు, పైపులైన్ల నిర్మాణం వంటి మౌలిక వసతుల కల్పనకు నిధులు సమకూర్చారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు వస్తున్నారు.

సొంతింటి కల నెరవేరింది



పెదపాడులో 30ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాను. ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఇల్లు నిర్మించుకోలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి స్థలంతోపాటు రుణం ఇవ్వడంతో ఇల్లు కట్టుకుని గృహప్రవేశం చేశాను. మా కుటుంబం సొంతింట్లో సంతోషంగా ఉంది. సొంతింటి కల నెరవేరడంతో ఎంతో ఆనందంగా ఉన్నాము.

– పెద్దిరెడ్డి లక్ష్మి, పెదపాడు

సంతోషంగా ఉన్నాం



ముఖ్యమంత్రి జగనన్న దయవల్ల సొంతిల్లు నిర్మించి సంతోషంగా ఉంటున్నాం. 36 ఏళ్లుగా అద్దె ఇంట్లోనే ఉన్నాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్థలం మంజూరు చేయడంతో మేము కష్టపడి ఇళ్లు ఏర్పాటు చేసుకుని సొంతింట్లో ఉంటున్నాం. ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం.

– రాజాన కనకదుర్గ, పెదపాడు

సమస్యలకు పరిష్కారం చూపుతున్నాం



పేదలకు ఇళ్లు సమకూర్చేందుకు ప్రభుత్వం అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తోంది. లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతివారం హౌసింగ్ డే నిర్వహించి లబ్ధిదారుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. అందరూ ఇల్లు నిర్మించేలా చర్యలు చేపడుతున్నాం.

– జీవీకే మల్లికార్జునరావు, జిల్లా పంచాయతీ అధికారి

ప్లాస్టిక్ కవర్ల నిషేధం హర్షణీయం



సమావేశంలో మాట్లాడుతున్న రీజనల్ చైర్మన్ సంకు సత్యకుమార్

నిడమర్రు: రాష్ట్రంలో ప్లాస్టిక్ కవర్లు నిషేధిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని మానవత సేవా సంస్థ రీజనల్ చైర్మన్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఆదివారం మండల మానవత సంస్థ సమీక్ష సమావేశం మండలపర్రులోని సరిపల్లి కుమారి నివాసం వద్ద జరిగింది. ఈసందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై ఎవరికి వారే స్పందించి ప్లాస్టిక్ కవర్లు వాడకం మానుకోవాలని కోరారు. ఈ విషయంలో మానవత సంస్థ నుంచి పూర్తి మద్దతు, సహకారం ఉంటుందన్నారు. అనంతరం సంస్థ ప్రగతి, సభ్యత్వ నమోదుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ముదునూరి త్రివేణి, మండల కార్యదర్శి నౌడు అచుత్య రామారావు, దెందుకూరి త్రిమూర్తిరాజు, ఇంటి చంటి, ఎంసీహెచ్ అప్పారావు, ఇందుకూరి సూర్యనారాయణరాజు, బత్రాజు ప్రసాద్, ఎస్. దావీదు పాల్గొన్నారు.

దత్త బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో దీపోత్సవం

ఉంగుటూరు: కృత్తికా నక్షత్రం కావడంతో ఆదివారం బాదంపూడి దత్త బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కృత్తికా నక్షత్ర దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేశారు. దత్త బాలసుబ్రహమణ్య స్వామి భక్తులు, గ్రామస్తులు హాజరై దీపోత్సవాన్ని తిలకించారు.

ఉప్పాకపాడు మాజీ సర్పంచి కమలమ్మ మృతి

ఉంగుటూరు: ఉప్పాకపాడు మాజీ సర్పంచి సత్తా కమలమ్మ (75) ఆదివారం కన్నుమూశారు. ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె చికిత్సపొందుతూ చనిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2006 నుంచి 2011 వరకు ఉప్పాకపాడు సర్పంచిగా సేవలందించారు. ఆమె మృతికి పలువురు గ్రామస్తులు సంతాపం తెలిపారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



పూళ్ల భవానమ్మ ఆలయంలో మాజేటి శేషగిరిరావు దంపతులను సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

భీమడోలు: మానసిక ప్రశాంతత ధ్యానం వల్లే సాధ్యమని ఏలూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి శేషగిరిరావు అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని భవానమ్మ ఆలయంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఒక రోజు ధ్యాన శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి శేషగిరిరావు మాట్లాడుతూ జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, మంచి ఆరోగ్యం, ఉత్తమైన జీవన విధానం ధ్యానం వల్ల సాధ్యమని అన్నారు. ఒత్తిడి లేని జీవనానికి ధ్యానం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం మాజేటి శేషగిరిరావు దంపతులను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాసరావు, భవానమ్మ కమిటి పెద్దలు పాశం రామాంజనేయులు, మానవత మండల అధ్యక్షుడు పచ్చా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని ఆదుకున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి



ప్రమాదానికి గురైన వ్యక్తిని అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించేందుకు వెళ్తున్న ఎమ్మెల్యే

దెందులూరు: రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తిని అంబులెన్స్‌ను పిలిపించి ఆస్పత్రికి తరలించి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి మానవత్వం చాటుకున్నారు. గన్నవరం కమ్యూనిస్టు పార్టీ ఆఫీసు ఎదురుగా ఒక వ్యక్తి బైక్‌పై నుంచి ఆదివారం ఏలూరు నుంచి విజయవాడ వెళుతూ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. విజయవాడ వెళుతున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి వెంటనే కాన్వాయ్‌ను ఆపి క్షతగాత్రుడిని పరామర్శించి సపర్యలు చేశారు. అంబులెన్స్‌కు సమాచారం అందించి, అది వచ్చే వరకూ అక్కడే ఉండి క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

నాగరాజు ఆకస్మిక మృతి బాధాకరం

దెందులూరు: మొర్ల నాగరాజు ఆకస్మిక మృతి బాధాకరమని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. ఆదివారం నాగులదేవునిపాడులో నాగరాజు సంతాప సభలో ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పాల్గొని నాగరాజు చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. నాగరాజు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు బోయపాటి గణేష్, వార్డు సభ్యులు శ్రీధర్ తదితరులు ఉన్నారు.

బాలలకు మధుమేహ నివారణ మందుల పంపిణీ



బాలలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉంగుటూరు: ఇటీవల చిన్నారుల్లో మధుమేహ వ్యాధి ఎక్కువుగా కనిపిస్తోందని ఇది ఆందోళన కలిగిస్తోందని ఆలిండియా డయాబెటీస్ రీసెర్చ్ సొసైటీ అధ్యక్షుడు డా.పీవీ రావు అన్నారు. ఆదివారం ఉంగుటూరు దివంగత డా. పాతూరి శివన్నారాయణ కమ్మ కల్యాణ మండపంలో చిన్నారులకు ఉచిత మధుమేహ వ్యాధి శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. పీవీ రావు మాట్లాడుతూ గతంలో దేశంలో చిన్నారులలో మధుమేహ వ్యాధి ఉండేది కాదని, ఇప్పుడు మధుమేహ వ్యాధితో బాధపడే చిన్నారుల శాతం పెరిగిందని అన్నారు. తల్లితండ్రులు అప్రమత్తమై తమ పిల్లలకు వైద్య పరీక్షలు చేయించాలన్నారు. కొన్ని కంపెనీలు అందిస్తున్న ప్రోత్సాహంతో హైదరాబాదు కేంద్రంగా 700 మంది పిల్లలను దత్తత తీసుకుని వారికి మధుమేహ వ్యాధి నివారణ మందులు పంపిణీ చేస్తున్నామని అన్నారు. ఆదివారం ఉంగుటూరులో నిర్వహించిన వైద్యశిబిరంలో మూడు జిల్లాల నుంచి 80 మంది చిన్నారులు హాజరయ్యారు. వారికి మందులు, టెస్టింగు కిట్లు, సూది మందులు ఉచితంగా అందజేశారు. వారందరికీ ఉచితంగా భోజన సదుపాయం కల్పించారు. డా. పీవీ రావుతోపాటు ఎస్ఆర్ఐ డా. నాగళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు. హైదరాబాదు నుంచి వచ్చిన టీం సభ్యులు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డా. పీవీ రావును, డా.శ్రీనివాసరావును గ్రామస్తులు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్లు కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, పాతూరి విజయకుమార్, కార్యక్రమం నిర్వాహకుడు పాతూరి వంశీ, పిళ్ళా రామకృష్ణ, చల్లా సూర్యారావు పాల్గొన్నారు.

నేడు గృహసారథుల సమావేశం

నిడమర్రు: బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం 4.30 గంటలకు గ్రామ సచివాలయం కన్వీనర్లు, గృహసారథుల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరవుతారన్నారు. క్రొవ్విడి, బావాయిపాలెం, ఛానమిల్లి, సిద్దాపురం, బువ్వనపల్లి, అడవికొలను, ఎనికేపల్లి గ్రామాల్లోని జగనన్న సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొంటారని తెలిపారు. ఈ సమవేశానికి వైసీపీ శ్రేణులు, సోషల్ మీడియా కన్వీనర్లు తప్పనిసరిగా హాజరవ్వాలని కోరారు.

ఘనంగా పెద్దింట్లమ్మ తల్లి వార్షికోత్సవం



రత్నాపురంలో భక్తుల పూజలందుకుంటున్న పెద్దింట్లమ్మ తల్లి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: కొల్లేరు వాసుల ఆరాధ్య దైవం పెద్దింట్లమ్మవారి చల్లని దీవెనలు ప్రజలందరికీ అందాలని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. కోరుకల్లు పంచాయతీ శివారు రత్నాపురంలోని పెద్దింట్లమ్మవారి 3వ వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 23 నుంచి ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి పూజలు చేశారు. ఆదివారం ఉంగుటూరు ఎమ్మెల్యే వాసుబాబు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసారు. కొల్లేరు వాసుల కొంగు బంగారమైన పెద్దింట్లమ్మ తల్లి ఈ ప్రాంత ప్రజలపై కరుణా కాటాక్షాలు చూపుతోందన్నారు. కొల్లేరులోని ప్రతి గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించే సంప్రదాయం కొనసాగించడం శుభపరిణామమన్నారు. తొలుత ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. కమిటీ నిర్వాహకులను ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాగు సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ టి.రామలింగరాజు, గుండుగొలను ఉపసర్పంచ్ ముదుండి సూర్యనారాయణరాజు, జగన్ సేవాదళ్ నియోజకవర్గ కన్వీనర్ తుమ్మగుంట రంగ, మండల ఇన్‌చార్జి పుప్పాల కార్తీక్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వేమలమంద రామరాజు, పెద్దలు దాట్ల సుబ్బరాజు, నంద్యాల సుబ్బరాజు, పిప్పర సుబ్బరాజు, వేగేశ్న వెంకట రామరాజు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

దెందులూరు: గ్రామానికి చెందిన మోటారు మెకానిక్ రమేష్ ఆదివారం తెల్లవారుజామున విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందాడని దెందులూరు ఎస్సై ఐ. వీర్రాజు తెలిపారు. రమేష్ (27) దెందులూరు ఎస్ఎంఆర్ నగర్‌లో మెకానిక్ షెడ్డు నిర్వహిస్తున్నాడన్నారు. రెండు రోజుల క్రితం రమేష్ పురుగు మందు తాగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు విజయవాడ ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం రమేష్ మృతి చెందాడని దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రిటైర్డ్ బీడీవో రామ్మోహనరావు సేవలు మరువలేనివి

భీమడోలు: రిటైర్డ్ బీడీవో, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అల్వా వెంకట రామ్మోహనరావు సేవలు మరువలేనివని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు శివారు ద్వారకానగర్ ఏరియాలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఇటీవల మృతి చెందిన అల్వా వెంకట రామ్మోహనరావుకు సంతాప సభను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మానవత మండల అధ్యక్షుడు పంచకర్ల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. పలువురు మాట్లాడుతూ భీమడోలు బ్లాక్ అభివృద్ధి అధికారిగా పని చేసిన రామ్మోహనరావు స్ఫూర్తిదాయక సేవలందించారన్నారు. ఆయన రిటైర్డ్ ఉద్యోగుల విశ్రాంత భవనానికి స్థలాన్ని దానం చేసిన మహోన్నత వ్యక్తి అన్నారు. మానవత మండల చైర్మన్ గుల్ల నూకరాజు, మండల అధ్యక్షుడు పంచకర్ల సత్యనారాయణ, హెచ్ఎం మండే సుధాకర్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ఎస్.పరదేశిరావు, గంధం వెంకట్రావు, పి.కోదండరామ్, బాబూరత్నం తదితరులు పాల్గొన్నారు.

తొలగని మంచు ముసుగు



తాడేపల్లిగూడెం రోడ్డును కమ్మేసిన మంచు

పగటి పూట ఎండ తీవ్రత పెరుగుతున్నా ఉదయాన్నే మంచు ముసుగు వీడటం లేదు. నాలుగు రోజులుగా తెల్లవారుజామున మంచు విపరీతంగా కురుస్తోంది. ఉదయం 7 గంటల వరకూ మంచు కురియడంతో రోడ్లపై వాహనదారులకు ఇబ్బంది తప్పడంలేదు. శివరాత్రి నుంచి మంచు, చలి శివశివా అంటూ సెలవు తీసుకుంటాయని పెద్దలు చెబుతారు. చలి తీవ్రత తగ్గినా తెల్లవారు జామున మంచు, చలి ఇంకా పెరుగుతోంది. పగటిపూట ఎండ తీవ్రత పెరిగి ఉక్కబోత మొదలైంది.

– గణపవరం